## రామ్మోహన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్ గౌడ్ ని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పరామర్శించారు. రామ్మోహన్ గౌడ్ తండ్రి ముద్దగోని యాదయ్య గౌడ్ ఇటీవల మరణించిన నేపథ్యంలో శనివారం వనస్థలిపురం వైదేహి నగర్ లోని వారి నివాసానికి వెళ్లి యాదయ్య గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్, పీసీసీ జనరల్ సెక్రటరీ పృథ్వి, సదాశివుడు నర్సింహా, లింగాల కిషోర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్, రామారావు కార్యకర్తలు ఉన్నారు.

### ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై
## కాంగ్రెస్ పార్టీ 'బీఎల్ఏ'ల అవగాహన సదస్సు



**విశ్వంభర, బడంగ్ పేట్ :** మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే కిచన్నగారి లక్ష్మా రెడ్డి ఆదేశాలమేరకు టి పీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 లో జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలోని తప్పులను సరిదిద్దేలా బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి, రాబోయే రోజుల్లో ప్రతికూలతలను అధిగమించడానికి క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా నిర్వహణ అత్యంత కీలకమైనదని, కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఓటర్లకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

## చైతన్యపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదులుకి ఘన సన్మానం




**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని రామకృష్ణా పురం ఐటీ డి ఈ ఎస్ కోపరేటివ్ సొసైటీ కాలనీ లో నాలుగు సంవత్సరాల పాప తప్పిపోయిన ఘటనపై వెంటనే స్పందించి, కొద్ది నిమిషాల్లోనే సంఘటన స్థలానికి చేరుకుని చర్యలు తీసుకున్న ఎస్.హెచ్.ఓ సైదులు ఘనంగా సన్మానించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో పోలీసు శాఖ వారు చూపుతున్న అప్రమత్తత, అంకితభావాన్ని ఉపేందర్ రెడ్డి అభినందిస్తూ సైదులు వారి పట్రోలింగ్ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగా స్వామి గౌడ్, రాజేశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ రావు, సత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చొరవతో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ ప్రెసిడెంట్ తోట మహేష్ ఆధ్వర్యంలో ప్రభాత్ నగర్ కాలనీ కి చెందిన ఎస్. నిరంజన్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.44,000 వేల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్రీశైలం యాదవ్, బసని బాలు, సంకరమోని ఆంజనేయులు, మహేష్ పాల్గొన్నారు.



మహేశ్వరం లోని పి ఎస్ వై కన్వెన్షన్ హాల్ లో మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ ( ఎస్ ఐ ఆర్) పై శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కల్వకుంట్ల తారక రామారావుని మర్యాదపూర్వకంగా కలిసిన మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ.
(విశ్వంభర, మహేశ్వరం)



మహేశ్వరం లో నిర్వహించిన సర్ , సభ్యత్వ నమోదు శిక్షణ కేంద్రానికి 58 వ డివిజన్ నుండి జటావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీగా బయలుదేరి కార్యక్రమంలో పాల్గొని అనంతరం కేటీఆర్ కు బహుమతిని బహూకరించిన జటావత్ శ్రీనివాస్ నాయక్.
(విశ్వంభర, మీర్ పేట్)

# మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

### సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండ పర్యటన సందర్భంగా పందుల సైదులు బహిరంగ లేఖ

**విశ్వంభర, నల్లగొండ బ్యూరో:** నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం లో జరిగిన,జరుగుతున్న అక్రమ నియామకాలు, అవినీతి, విద్యార్థులపై వేధింపులు, ఖాళీ పోస్టులు, ఔట్ సోర్సింగ్ అక్రమాలు, ప్రజాస్వామిక వాతావరణం మరియు ఇతర సమస్యలపై తక్షణ జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలంగాణ విద్యావంతుల వేదిక, న్యాయవాది నల్గొండ జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు.

**మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం-ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన పరిస్థితులు..**

విశ్వవిద్యాలయం అనేది కేవలం పరీక్షలు నిర్వహించే సంస్థ కాదు.అది రాజ్యాంగ విలువలు, సామాజిక చైతన్యం, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య సంస్కృతిని విద్యార్థుల్లో పెంపొందించే కేంద్రం.కానీ ప్రస్తుతం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులను భాగస్వాములుగా కాకుండా అనుమానితులుగా చూసే పరిపాలనా ధోరణి కొనసాగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. విద్యార్థులు తమ సమస్యలను ప్రస్తావించిన ప్రతిసారి చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి, క్రమశిక్షణ చర్యలు, సస్పెన్షన్లు, పోలీసు కేసులు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం విద్యా వ్యవస్థ లక్ష్యానికి విరుద్ధమన్నారు.

**2012 అక్రమ నియామకాలపై తక్షణ చర్య తీసుకోవాలి..**

2012లో జరిగిన 31 టీచింగ్ నియామకాలపై రోస్టర్, రిజర్వేషన్ నిబంధనల ఉల్లంఘన జరిగిందని అనేక ఆరోపణలు వచ్చాయి.ప్రభుత్వ కమిటీలు కూడా విచారణ చేసి నివేదికలు సమర్పించినప్పటికీ, వాటిపై ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించలేదు.2007లో స్థాపించబడిన మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 2012లో అప్పటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి హయాంలో 31 టీచింగ్ పోస్టులను రోస్టర్, రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా భర్తీ చేశారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.
కమిటీ నివేదికలను అమలు చేయలేదు,ఈ నియామకాలపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ మరియు విచారణ కమిటీ అక్రమాలు జరిగినట్లు గుర్తించి చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.అక్రమ పద్ధతిలో నియామకమైన వారికి ప్రమోషన్లు ఇచ్చినారు.బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రస్తుత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఇదే నియామకాలపై షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, ప్రస్తుతం అదే వ్యక్తులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇవ్వడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. మా విజ్ఞప్తి ఏమనగా.!కమిటీ నివేదికలను బహిరంగ పరచాలి.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.అక్రమ నియామకాల వల్ల నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలి.

**ఖాళీ టీచింగ్ పోస్టుల భర్తీ చేయాలి..**

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 130కు పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు.చాలా విభాగాలు అతిథి అధ్యాపకులపై ఆధారపడుతున్నాయి. విశ్వవిద్యాలయంలో 130 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు అనేక టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు సంవత్సరాలుగా ఖాళీగా ఉన్నాయి.దీంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం వెంటనే అన్ని ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేయాలి. గతంలో పాలమూర్,తెలంగాణ,శాతవాహన, కాకతీయ,యూనివర్సిటీ ల కు సంబంధించిన ఇంజనీరింగ్ కళాశాలకు టీచింగ్ పోస్ట్స్ ఇవ్వడం జరిగింది. కానీ మహాత్మ గాంధీ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి ఇప్పటివరకు టీచింగ్ పోస్ట్ శాంక్షన్ చేయలేదు.ఇది మాత్మ గాంధీ యూనివర్సిటీ పట్ల జరుగుతున్న వివక్షతగా మేము భావిస్తా ఉన్నాం. తక్షణమే అన్ని డిపార్ట్మెంట్లకు శాశ్వత ప్రాతిపదికన ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.కావునా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నియామక డ్రైవ్ నిర్వహించాలి.ఇంజినీరింగ్ కళాశాలకు కూడా శాశ్వత టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలి.రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శక నియామకాలు చేపట్టాలి.

**ఔట్‌సోర్సింగ్ నియామకాలపై న్యాయ విచారణ చేయాలి..**

ఇంత పెద్ద యూనివర్సిటీలో 4 నాన్ టీచింగ్ స్టాఫ్, మాత్రమే ఉన్నారు. సుమారు 300 పైగా ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఔట్ సోర్సింగ్ నియామకాలలో నిరుద్యోగుల నుండి లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.దీనిపై స్వతంత్ర విచారణ జరిపి సంబంధిత అధికారులు, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం..మా ప్రధానమైన డిమాండ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి లేదా విజిలెన్స్ కమిటీతో విచారణ జరపాలి.బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.భవిష్యత్తులో అన్ని నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలి.

**విద్యార్థులపై సస్పెన్షన్లు, పోలీసు కేసులు పెట్టారు..**

విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలు,అవినీతిని ప్రశ్నించిన విద్యార్థులను సస్పెండ్ చేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం అత్యంత బాధాకరం.ప్రజాస్వామికబద్ధంగా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థుల ప్రశ్నించే హక్కును హరించివేస్తూ మహాత్మా గాంధీ యూనివర్సిటీ వి సీ నియంతలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలు చెప్పిన విద్యార్థుల భవిష్యత్తుతో యూనివర్సిటీ యాజమాన్యం ఆడుకోవడం ఏ మాత్రం సమంజసం కాదు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించాలి. ప్రశ్నించే హక్కు ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును అణిచివేయకుండా విద్యార్థులకు భరోసా కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను ప్రస్తావించిన విద్యార్థులపై కేసులు నమోదు చేయడం, బైండోవర్ చర్యలు తీసుకోవడం, సస్పెండ్ చేయడం రాజ్యాంగ హామీలకు విరుద్ధం. కావునా అన్ని కేసులను సమీక్షించి ఉపసంహరించాలి.సస్పెన్షన్లను రద్దు చేయాలి.విద్యార్థి సంఘాలతో చర్చల కమిటీ ఏర్పాటు చేయాలి.

**హాజరు శాతం పేరుతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకూడదు..**

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు వంటి కారణాల వల్ల హాజరు తగ్గిన విద్యార్థులకు మానవీయ దృక్పథం అవసరం.60% హాజరు ఉన్నప్పటికీ పరీక్షలకు అనుమతించకపోవడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కావునా ప్రత్యేక కండోనేషన్ విధానం తీసుకురావాలి.ఒక్క హాజరు కారణంగా విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలి.

**హాస్టల్, తాగునీరు, ఆహారం, మౌలిక వసతులు కల్పించాలి**

విద్యార్థుల ప్రాథమిక అవసరాలైన హాస్టల్, పరిశుభ్రత, నాణ్యమైన భోజనం, తాగునీరు, లైబ్రరీ, వైఫై వంటి అంశాల్లో లోపాలు ఉన్నాయని విద్యార్థులు పదేపదే తెలియజేస్తున్నారు. ఈ పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ నిర్వహించాలి.హాస్టల్ సదుపాయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. పెండింగ్ భవనాలను వెంటనే పూర్తి చేయాలి.

**మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహించాలి..**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సేవాలాల్ మహారాజ్ వంటి మహనీయుల జయంతులను అధికారికంగా, విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించడం విశ్వవిద్యాలయ బాధ్యత.
మానియులను గౌరవించే విధంగా ప్రతి సంవత్సరం అధికారిక వేడుకలు నిర్వహించాలి.వారి భావజాలంపై ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలి.క్యాంపస్‌లో రాజ్యాంగ విలువలపై కార్యక్రమాలు నిర్వహించాలి.

**స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి..**

విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు ప్రభుత్వం స్వతంత్ర కమిటీని నియమించాలి.మా విన్నపం ఏంటంటే.. 2012 అక్రమ నియామకాలపై కమిటీ నివేదికలను వెంటనే అమలు చేయాలి.అక్రమంగా జరిగిన నియామకాలు, పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలి.130 ప్రొఫెసర్ పోస్టులతో పాటు అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. ఔట్ సోర్సింగ్ నియామకాల అవినీతిపై న్యాయపరమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.విద్యార్థులపై నమోదైన అన్యాయ కేసులు, సస్పెన్షన్లను సమీక్షించి ఉపసంహరించాలి.పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలి. విశ్వవిద్యాలయంలో పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను అమలు చేయాలి.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ నల్లగొండ పర్యటన కేవలం ఒక అధికారిక కార్యక్రమంగా కాకుండా, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో న్యాయం, పారదర్శకత, ప్రజాస్వామ్య పరిపాలన పునరుద్ధరణకు చారిత్రాత్మక ఆరంభంగా నిలవాలని కోరుకుంటున్నాము. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు పోషించిన పాత్రను గుర్తించి, వారి రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించే దిశగా మీరు ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నామని పందుల సైదులు అన్నారు.



పెద్ద అంబర్‌పేట్‌లోని వీఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరై నూతన వధూవరులు లాస్యరెడ్డి - అభిషేక్‌రెడ్డిలను ఆశీర్వదించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, కొత్తూరు వీరేందర్ తదితరులు.

## గౌడ్ సమాజ అభ్యున్నతికి "గోపా" వేదికగా సేవలు

**- డాక్టర్ బండి సాయన్న గౌడ్**




**విశ్వంభర, కామారెడ్డి :** గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ("గోపా") ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సభకు రంగా వెంకటేశ్వర్లు గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ మాట్లాడుతూ గౌడ్ సమాజ అభ్యున్నతికి అధికారులు, ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ అందరూ ఒకే వేదికపైకి వచ్చి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, సామాజిక చైతన్యం, రాజకీయ భాగస్వామ్యం పెంపొందించడంలో "గోపా" కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. జిల్లా కమిటీ ఏర్పాటు ద్వారా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గౌడ్ యువత, విద్యార్థులు, ఉద్యోగులను సంఘటితం చేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారుగోపా ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో 5 వేల సభ్యత్వాలను నమోదు చేయడం తమ లక్ష్యమని ప్రకటించారు.
సభ్యులందరి సమక్షంలో ఈ క్రింది నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు:
జిల్లా అధ్యక్షులు: రంగా వెంకటేశ్వర్ గౌడ్
ప్రధాన సలహాదారు: ఉప్పునూతల రమేష్ గౌడ్
ప్రధాన కార్యదర్శి: లింగాల రాజబాబు గౌడ్
కోశాధికారి: నడిల్లా యాదగౌడ్
ఉపాధ్యక్షులు: అంకన్నగారి నాగరాజు గౌడ్, అనుగూనూరి కృష్ణ గౌడ్
ఆర్గనైజింగ్ సెక్రటరీ: బాబా గౌడ్
జాయింట్ సెక్రటరీలు: డాక్టర్ పల్సా హరీష్ గౌడ్, సుదీమ్ కృష్ణ గౌడ్, తిమ్మక్‌పల్లి శివ గౌడ్
సెక్రటరీలు: చింతకింది స్వామి గౌడ్, పాతింటి నరేందర్ గౌడ్, బట్టుపల్లి రేణుక గౌడ్, అరుణ గౌడ్
సలహాదారులు: బొర్ర రాజు గౌడ్, కొడిపాక నరేందర్ గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్
కార్యనిర్వాహక సభ్యులు: మర్రిపల్లి స్వామి గౌడ్, దేవోళ్ల ఎల్లా గౌడ్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మీరయ్య గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, ఆర్‌టిఓ ప్రదీప్ గౌడ్, నరేష్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్' కార్యక్రమంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వోలు

### ఇంటింటికీ వెళ్లి వివరాల ధృవీకరణ.. అవసరమైన పత్రాలపై సూచనలు



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సరూర్ నగర్ మండల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జ్యోతి, బీఎల్ఓ లీలా కుమారి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు.ఓటరు జాబితాలో ఉన్న వివరాలను ధృవీకరించుకోవడం కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడం, పేరు, చిరునామా, వయస్సు వంటి వివరాల్లో మార్పులు అవసరమైతే దరఖాస్తు చేసుకోవడం, మరణించిన ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు వివరంగా తెలియజేస్తున్నారు. అవసరమైన దరఖాస్తు ఫారాలు ఎలా నింపాలి, ఏయే పత్రాలు జత చేయాలి, నిర్ణీత గడువులోగా వివరాలు సమర్పించాల్సిన అవసరం ఏమిటనే విషయాలను కూడా బీఎల్‌వోలు వివరిస్తున్నారు. ఓటర్లందరూ బీఎల్‌వోలతో సహకరించి సరైన సమాచారం అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వెంటనే వాటిని సరిదిద్దుకునేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.ప్రజలు తమ ఇంటికి వచ్చే బీఎల్‌వోలకు అవసరమైన పత్రాలు అందించి వివరాల ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని రెవెన్యూ ఇన్స్ పెక్టర్ జ్యోతి విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, ఖచ్చితంగా ఉండాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# రుణం ఇప్పిస్తామని నమ్మించి మోసం

## ఇద్దరిపై కేసు నమోదు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రుణం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు అయిన సంఘటన చైతన్యపురి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం రుణం ఇప్పిస్తామని నమ్మించి, ఏజీపీఏ పత్రాలను దుర్వినియోగం చేసి కోట్ల విలువైన ఆస్తిని అక్రమంగా విక్రయించిన ఇద్దరు ప్రధాన నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాకు చెందిన 80 ఏళ్ల మారోజు అంజయ్య చారి ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేశారు. 2018లో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో రూ.35 లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మించిన నిందితులు, రుణ భద్రత పేరుతో అగ్రిమెంట్, ఎంఓయూ పత్రాలపై సంతకాలు తీసుకున్నారని పోలీసులు తెలిపారు. అనంతరం ఆ పత్రాలను దుర్వినియోగం చేసి బాధితుడి ఆస్తిని మరో వ్యక్తి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, తర్వాత విక్రయించి బ్యాంకు రుణం కూడా పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుడు రుణంతో పాటు వడ్డీ మొత్తాన్ని పూర్తిగా చెల్లించినప్పటికీ, ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన కాలహస్తి మధు పరమేశ్వరరావు,వంగాల రవి కిరణ్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఇదే తరహాలో మరికొంతమందిని కూడా మోసగించినట్లు ప్రాథమిక సమాచారం లభించిందని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108